క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్న ఈటీసీ మేనేజర్ శ్రీనివాసరావు

సామర్లకోట: ఉపాధి పనులు మరింత నాణ్యతతో జరిగేలా డ్వామా అధికారులు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం మేనేజర్, సీనియర్ ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు తెలిపారు. కేంద్రంలో 11 జిల్లాలకు చెందిన డ్వామా ఏపీడీ, ఏపీఓలకు రెండో బ్యాచ్‌లో మూడు రోజుల శిక్షణలో శుక్రవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈటీసీ ప్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్ రెండో రోజు శిక్షణ ఇచ్చారు.

పొలంబడిపై అవగాహన కల్పించండి



పొలంబడిలో సూచనలిస్తున్న ఏఓ సంజయ్

పెద్దాపురం: రైతులకు పొలంబడిపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్ఏలదేనని మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కాండ్రకోటలో శుక్రవారం వ్యవసాయ సహాయకులు స్రవంతి అధ్యక్షతన పొలంబడిపై నిర్వహించారు. సంజయ్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ఆకుముడత, దోమపోటుపై దృష్టి సారించాలన్నారు. ఈకేవైసీ నమోదు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఈఓ ప్రసాద్, రైతులు, ఆయా గ్రామాల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణ



భక్త మండలి సభ్యులను సత్కరించిన మల్లికార్జునస్వామి

సామర్లకోట: ఆరు రోజుల పాటు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ఆరు రోజులుగా ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పారాయణ నిర్వహించడం జరిగిందని పెద్దాపురం ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జున స్వామి తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి భక్త మండలిచే పారాయణలో పాల్గొన్నారని చెప్పారు. పారాయణం ముగింపును పురస్కరించుకొని భక్త మండలి సభ్యులను మల్లికార్జున స్వామి సత్కరించారు. వాసవీ సేవా సంస్థలకు ప్రతినిధులు కటకం కృష్ణ సుజన్, కంచర్ల మల్లిబాబు, కుసుమంచి శేష గిరిరావు, జీవీకె మోహనరావు, కంచర్ల భాగ్యలక్ష్మి, కటకం శ్రీరామచంద్రమూర్తి, పూరా సత్యనారాయణ, కటకం త్రినాథరావు, కటకం సుమలత, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబులు భక్తులకు సేవలందించారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ సుభద్ర

పిఠాపురం: విద్యార్థులు చదువులో రాణించి మంచి మార్కులు సాధించాలని డీవైఈఓ డి.సుభద్ర సూచించారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం ఆమె దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పలు పథకాల ద్వారా విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు, ఉపాధ్యాయులు రమణమూర్తి, అనంతలక్ష్మి, సురేష్‌కుమార్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కబోత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేద తీరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



కొత్తపల్లిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: పల్లెలను ప్రగతి పథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్తపల్లిలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టి మోసగించడం కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచి గవర భవానీ, వైఎస్సార్ సీపీ నాయకుడు గవర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొరబాబును శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపల్లి ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కరు విగ్రహానికి ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించే షెడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన దాసం సుబ్రహ్మణ్యాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో సచివాలయ కన్వీనర్ సానా నాగు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గింజాల శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు

- పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విమల
- పిలు అభివృద్ధి పనులకు తీర్మానం



పిఠాపురం మార్కెట్ కమిటీ ఆవరణలో మొక్కలు నాటుతున్న నూతన కార్యవర్గ సభ్యులు

పిఠాపురం: కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని పిఠాపురం మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మొగలి విమల తెలిపారు. పిఠాపురం మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ విమల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. పిఠాపురం మార్కెట్ కమిటీ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో రైతులకు ఉపయోగకరమైన పుంత రోడ్లు శిథిలావస్థకు చేరడంతో వాటిని పునర్నిర్మించడానికి కమిటీ తీర్మానించింది. నియోజకవర్గపరిధిలో చింతపండు, మిర్చి తదితర పంటలు నిల్వ చేసుకోవడానికి గిడ్డంగులు సరిపడా లేకపోవుడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ఉన్న మార్కెట్ యార్డు స్థలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి తీర్మానం చేశారు. అలాగే గొల్లప్రోలులో షాపింగ్ కాంప్లెక్స్, రైతు బజారు నిర్మించడానికి కమిటీ తీర్మానించింది. గొల్లప్రోలు సబ్ మార్కెట్ యార్డులో శిథిలావస్థలో ఉన్న రెండు 400 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోదాములను తొలగించాలని నిర్ణయించారు. మార్కెట్ యార్డు కార్యాలయం పరిధిలోని పలు అభివృద్ధి పనుల నిర్వహణ, కార్యాయంలో సిబ్బంది కొరత ఉండడంతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని నియమించుటకు గాను కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విమల మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మార్కెట్ కమిటీ కార్యవర్గం లేకపోవడంతో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రస్తుతం నూతన కార్యవర్గం ఏర్పాటు కావడంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జి, మార్కెట్ కమిటీ సెక్రటరీ కేఆర్ఆర్ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు సమస్య నివారణకు చర్యలు



కాలువలో పూడికను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

పిఠాపురం: మున్సిపాలిటీ పరిధిలో ముంపు నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. పిఠాపురం పట్టణంలో శుక్రవారం ఆమె పర్యటించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంపు సమస్యకు గల కారణాలను కనుక్కొని నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పిఠాపురం పట్టణంలో ఆరు వార్డులు ఎక్కువగా ముంపు బారిన పడుతున్నట్లు గుర్తించామన్నారు. వీలైనంత త్వరలో ముంపు సమస్యకు పరిష్కారం చూపించనున్నట్లు ఆమె తెలిపారు. ఎక్కువగా మురికి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల అవి మురికి నీటిని వెళ్లకుండా అడ్డుకుంటున్నాయన్నారు. దీంతో కాలువల్లో నీరు పారక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. డ్రైన్లలో పూడికను పూర్తిగా తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా అన్నప్రాశన

సామర్లకోట: స్థానిక సంగీతరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అన్నప్రాశన నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొనగా సచివాలయ మహిళా పోలీసు, గన్ని లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



చిన్నారికి పరమాన్నం పెడుతున్న కౌన్సిలర్ వీరభద్రరావు

ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ



సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా 14వ వార్డుకు చెందిన బి.అప్పారావు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీరు లక్ష్మి వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావుతో కలిసి కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావుకు శుక్రవారం సాయంత్రం పింఛను అందజేశారు.

అప్పారావుకు పింఛను అందజేసిన వలంటీరు లక్ష్మి, కౌన్సిలర్ వీరభద్రరావు

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమంద్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ పరిచారకులు చిట్టిం వాసు, చెల్లపళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆధ్యాత్మికతతో ప్రపంచ శాంతి



ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

పెద్దాపురం: ప్రపంచ శాంతికై ప్రతి ఒక్కరూ పరిశుద్ధ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని దైవజనులు చంద్రపాల్ అన్నారు. క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనల్లో భాగంగా మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ వ్యవస్థాపకులు నంగిన సత్యానందం అధ్యక్షతన విరవ వైఎస్సార్ కాలనీ చర్చిలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్, మందిరం నిర్వాహకుడు సత్యానందం మాట్లాడుతూ ప్రార్థనల్లో ప్రతి ఒక్కరూ దేవుని ఆశీస్సులు పొందాలన్నారు.

నిందితుల సీసీ ఫుటేజీ విడుదల



పోలీసులు విడుదల చేసిన నిందితుల సీసీ ఫుటేజీ

పెద్దాపురం: పట్టణంలోని ఓ ఇంట్లో ఇటీవల దొంగతనం చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు అనుమానితుల సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు శుక్రవారం విడుదల చేశారు. నిందితుల వివరాలు ఎవరికైనా తెలిస్తే 94409 04846 నెంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

నేటి నుంచి హెల్ప్‌డెస్క్

సామర్లకోట: మున్సిపాలిటీలో శనివారం నుంచి మూడు రోజుల పాటు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందన్నారు. కాలనీ వాసులు వారి సమస్యలు, సలహాలకు పి.జానకి బాబు 98660 16053, బి.అప్పారావు 93470 60295 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పాడి రైతులకు గిట్టుబాటు ధర

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



కొత్తపల్లిలో జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: జగనన్న పాల వెల్లువలో పాడి రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైతుల నుంచి పాల సేకరణపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల వెల్లువ కేంద్రాలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. పాల వెల్లువ కేంద్రాల ద్వారా పాల సేకరణపై రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. ఇకపై దళారులు, మధ్యవర్తులు లేకుండా రైతులే నేరుగా పాలను విక్రయించి మద్దతు ధరను పొందవచ్చన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగన్న పాలవెల్లువ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర భవాని, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎంపీడీఓ అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ చెరువులో చేపలు మృతి



సీతారామ చెరువులో మృతి చెందిన చేపలు

పెద్దాపురం: స్థానిక సీతారామచెరువులో శుక్రవారం ఉదయం చేపలు భారీగా మృతి చెందాయి. ఎవరైనా విష ప్రయోగం చేశారా.. లేక మరేదైనా కారణం ఉందా అని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన చేపల విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని బాధితులు సుబ్బారావు, నిత్యానందం తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న మరిడమ్మ వారు

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల గ్రామానికి చెందిన ఐతు శివ కనిపించటం లేదని అతని భార్య హేమలత శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. శివ, హేమలత ఈ మధ్యే ప్రేమ వివాహం చేసుకున్నారు. జగ్గంపేట నెహ్రూ కాలనీలో నివాసం ఉంటున్నారు. శివ స్థానిక కిరణ్ కంటి ఆసుపత్రిలో పనిచేస్తున్నాడని, గత నెల 27న ఇంటి మేడపై ఫోన్ మాట్లాడుతున్న శివ ఎంతకి కిందకు రాకపోవడంతో వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో అతని భార్య హేమలత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. శివ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడంతో శుక్రవారం అతని భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘సంపూర్ణ పోషణ’ను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



గొల్లప్రోలులో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. గొల్లప్రోలులో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా ఇచ్చే టేక్ హోమ్ రేషన్ పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి, బిడ్డా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణను అమలు చేస్తోందన్నారు. ఇకపై గర్భిణులు, బాలింతల ఇంటికే పౌష్టికాహారం అందజేస్తారన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్‌కే దుర్గాదేవి, సూపర్‌వైజర్లు నాగమణి, కృష్ణవేణి గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి, వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, తెడ్లపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

పెద్దాపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావులు అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనా బీబీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అగ్రో డైరెక్టర్ జానీ, మండలంలోని కాండ్రకోటలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వడ్లమూరులో కంటే వీర్రాఘవరావు, దివిలిలో సర్పంచ్ పెంకే శ్రీను, ఉప సర్పంచ్ వి.రమేష్ ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్ల గంగారావు, శ్రీనివాస్, గవరసాని రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు కళ, బషీర్, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందని పాత ఇసుకపల్లి సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా అన్నారు. పాత ఇసుకపల్లిలోని గర్భిణులు, బాలింతలకు శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా టేక్ హోమ్ రేషన్‌ను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న టేక్ హోమ్ రేషన్‌ను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుర్రాల మంగతాయారు, వైఎస్సార్ సీపీ నేత గుళ్లపల్లి వీరభద్రరావు, సచివాలయ కన్వీనర్ దివాకర్‌రెడ్డి, గుళ్లపల్లి వెంకటరమణ, కూతా నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు కొత్తపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

సామర్లకోట: పుట్టబోయే బిడ్డలు మరింత ఆరోగ్యంగా ఉండాలని, అధిక తెలివి తేటలు కలిగి ఉండే విధంగా సంపూర్ణ పోషణ కిట్లు దోహదపడతాయని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం వారు ఈ కిట్లను పంపిణీ చేసి గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



13వ వార్డులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేసిన నేతల హరిబాబు



పాత ఇసుకపల్లిలో బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న నాయకులు



వడ్లమూరులో పోషణ కిట్లను అందజేస్తున్న వీర్రాఘవరావు

విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరం

ఏలేశ్వరం: విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరమని స్థానిక ఎస్సై జి.సతీష్ అన్నారు. మండలంలోని యర్రవరంలో విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానందా సేవాసమితి ట్రస్టు ఆధ్వర్యంలో సమాజం–మనబాధ్యత, భవిష్యత్ నిర్మాణం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజం పట్ల అవగాహనతో పాటు బాధ్యత కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల అధినేత డీవీఎస్ రాజు, వివేకానందా ట్రస్టు అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, వెలుగూరి హరేరామ్, గోళ్ల నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి ఎస్సైగా ఉమామహేశ్వరరావు

కిర్లంపూడి: కిర్లంపూడి ఎస్సైగా పిక్కి ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఎస్సై టి.రఘునాథరావు అల్లూరి సీతారామరాజు జిల్లా జెడ్డంగి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్‌లో పని చేసిన ఉమామహేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టంగా లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తామని తెలిపారు.